

హైకోర్టు న్యాయమూర్తి ప్రమాణం చేస్తున్న జస్టిస్ సుజయ్‌పాల్

## హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుజయ్‌పాల్ ప్రమాణం

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సుజయ్‌పాల్ మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆయనతో ప్రమాణం చేయించారు. ఇప్పటివరకు మధ్యప్రదేశ్ హైకోర్టులో పనిచేసిన జస్టిస్ సుజయ్‌పాల్‌ను తెలంగాణకు బదిలీ చేస్తూ రాష్ట్రపతి జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ చదివి వినిపించారు. ఈ కార్యక్రమానికి జస్టిస్ సుజయ్‌పాల్ కుటుంబసభ్యులు, అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి, అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహశర్మ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వరరావు హాజరయ్యారు. అనంతరం ప్రధాన న్యాయమూర్తితో కూడిన ద్విసభ్య ధర్మాసనంలో జస్టిస్ సుజయ్‌పాల్ కేసుల విచారణ చేపట్టారు. కాగా, కలకత్తా హైకోర్టు నుంచి బదిలీపై తెలంగాణ హైకోర్టుకు రానున్న జస్టిస్ మౌసమీ భట్టాచార్య ఈ నెల 28న పదవీ ప్రమాణం చేయనున్నారు.

## కాంగ్రెస్ నేతల ఇసుక దందా!

- అధికారులతో కుమ్మక్కై ఇష్టానుసారంగా తరలింపు
- పర్మిషన్ 10 ట్రిప్పులకు.. రవాణా 50 నుంచి 60 లోడ్లు
- తహసీల్దార్‌కు రైతులు, బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు
- రెవెన్యూ ఆఫీసులో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల వాగ్వాదం



అధికారి ఎదుటే బీఆర్ఎస్ నేతలు, రైతులతో కాంగ్రెస్ నేతల వాగ్వాదం

పెంట్లవెల్లి, మార్చి 26: నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలంలోని జటప్రోల్, కొండూరు, శింగవరం, గోప్లాపురం గ్రామాల సమీపంలో ఉన్న వాగుల నుంచి కాంగ్రెస్ నేతలు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. అభివృద్ధి పనుల పేరిట నెల రోజులుగా అధికారులు పర్మిషన్లు ఇస్తున్నారు. 8 నుంచి 10 ట్రిప్పులకు అనుమతి తీసుకొని.. 50 నుంచి 60 ట్రిప్పుల వరకు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారని ఆయా గ్రామాల రైతులు, బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. రహస్య ప్రాంతాల్లో వందల ట్రాక్టర్ల ఇసుక డంప్ చేసుకుంటున్నారని కొండూరుకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, రైతులు మంగళవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలించినా, అభివృద్ధి పనుల పేరిట విక్రయించినా, డంప్ చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హిమబిందు హెచ్చరించారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న కొండూరుకు చెందిన కాంగ్రెస్ నాయకులు అధికారి ఎదుటే రైతులు, బీఆర్ఎస్ నేతలతో వాగ్వాదానికి దిగారు. తహసీల్దార్, అధికారులు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

# దొంగలకు గేట్లు తీసుడేంది ?

- నిజమైన, కార్యకర్తలు చచ్చిపోతరు
- రేవంత్‌ను నిలదీసిన కాంగ్రెస్ నేత లక్ష్మారెడ్డి
- చేవెళ్ల ఎంపీ నియోజకవర్గ సమావేశంలో నిలదీత
- సర్వేల ఆధారంగానే టికెట్లు ఇచ్చామన్న రేవంత్‌రెడ్డి



సీఎం రేవంత్ ఎదుటే నిరసన వ్యక్తంచేస్తున్న మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): పార్టీ నిర్ణయాన్ని ఎవరూ ప్రశ్నించకూడదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ హుకుం జారీ చేసిన 24 గంటల్లోనే ఆ పార్టీ మరో సీనియర్ నేత తన నిరసనగళాన్ని వినిపించారు. కాంగ్రెస్‌ను మోసంచేసిన దొంగలకు డోర్లు ఎలా తెరుస్తారు? అని పీసీసీ చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నేత కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి నిలదీశారు. 'కాంగ్రెస్‌ను మోసం చేసిన దొంగలకు డోర్లు తెరిచి పార్టీలో చేర్చుకుంటే మాలాంటి నాయకులు, కార్యకర్తలు చచ్చిపోతారు' అని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ముఖ్యనేతల సమావేశం జరిగింది. చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డితో కలిసి పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన ఈ సమావేశానికి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేశ్వరం అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి పోటీచేసి ఓడిపోయిన కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌ను మోసం చేసిన దొంగలను పార్టీలో చేర్చుకుంటే తమలాంటి వాళ్లంతా ఏం కావాలి? అని ప్రశ్నించారు. దీంతో సమావేశంలో పాల్గొన్న నేతలంతా ఏకీభవిస్తూ పెద్దపెట్టున చప్పట్లు చరిచి మద్దతు పలికారు. ఆ సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి ఇబ్బందికరంగా ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటూ ఉండిపోయారు.

### సర్వేల ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక: రేవంత్‌రెడ్డి

క్షేత్రస్థాయిలో అందరి అభిప్రాయాలు, సర్వేల ఆధారంగానే చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో రంజిత్‌రెడ్డి, దానం నాగేందర్, సునీతా మహేందర్‌రెడ్డికి టికెట్లు ఇచ్చామని రేవంత్ సమర్థించుకున్నారు. ఒకే సామాజిక సామాజిక వర్గానికి చెందిన నేతలకే పార్టీలో పెద్దపీట వేస్తున్నారన్న విమర్శలకూ సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్‌తోనే అందరికి సామజిక న్యాయం జరుగుతుందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికలు తమ 100 రోజుల పాలనకు రెఫరెండం అని వ్యాఖ్యానించారు. తెలంగాణ నుంచి 14 పార్లమెంట్ స్థానాలు గెలుచుకొని సోనియాగాంధీకి కృతజ్ఞతలు తెలుపుతామని వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో వచ్చే నెల 6 లేక 7న జాతీయ స్థాయిలో కాంగ్రెస్ ప్రకటించే గ్యారెంటీలపై భారీ సభ నిర్వహిస్తామని రేవంత్ తెలిపారు.

### పెరుగుతున్న నిరసన గళాలు

కాంగ్రెస్‌ను నమ్ముకున్న వారికి కాకుండా బయటి నుంచి వచ్చిన వారిని పార్టీలో చేర్చుకొని టికెట్లు ఇవ్వటాన్ని సీనియర్ నేతలు నిరంజన్, వీహెచ్ తప్పుపట్టిన విషయం తెలిసిందే. పార్టీ నిర్ణయానికి విరుద్ధంగా మాట్లాడితే క్రమశిక్షణ చర్యలు తప్పవని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో బీసీ నాయకులు కాబట్టి హెచ్చరించారని, మరి రెడ్డి నాయకులైతే హెచ్చరించేవారా? అని బీసీ నేతలు మండిపడ్డారు. తాజాగా నిరసన గళం విప్పిన లక్ష్మారెడ్డి 'రెడ్డి' సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కావటంతో పీసీసీ ఎలా స్పందిస్తుందో చూడాలి.

## ఏసీబీకి చిక్కిన ఎంపీడీవో, సీనియర్ అసిస్టెంట్

### తోటి ఉద్యోగికి సర్వీస్ రిజిస్టర్ ఇచ్చేందుకు లంచం డిమాండ్



ఏఈసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన హరిబాబు

కమ్మర్‌పల్లి, మార్చి 26: సర్వీస్ రిజిస్టర్ ఇచ్చేందుకు తోటి ఉద్యోగి నుంచి లంచం తీసుకుంటూ ఎంపీడీవో, సీనియర్ అసిస్టెంట్ ఏసీబీకి చిక్కారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో చోటుచేసుకుంది. ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ మంగళవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. కమ్మర్‌పల్లి మండల పంచాయతీ అధికారిగా పనిచేసిన భాగయ్య బదిలీపై ఇందల్వాయి మండలానికి వెళ్లారు. ఈ క్రమంలో తన సర్వీస్ రిజిస్టర్ (ఎస్ఆర్) ఇవ్వాలని ఎంపీడీవో సీ సంతోష్‌రెడ్డిని కోరగా.. రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సంతోష్‌రెడ్డి ఇటీవలే కామారెడ్డి జిల్లా భిక్కనూర్‌కు బదిలీ అయ్యారు. అయితే.. లంచం ఇవ్వాల్సిన అవసరం లేకుండానే తన ఎస్ఆర్ తీసుకోవచ్చని ఆశించిన భాగయ్య.. సీనియర్ అసిస్టెంట్ హరిబాబు వద్దకు వెళ్లగా ఇవ్వలేదు. డబ్బులు ఇవ్వనిదే సర్వీస్ బుక్ ఇవ్వొద్దని బదిలీపై వెళ్లిన ఎంపీడీవో సంతోష్‌రెడ్డి ఆదేశించారు. దీంతో భాగయ్య ఏసీబీని ఆశ్రయించారు. ఏసీబీ అధికారులు మంగళవారం కమ్మర్‌పల్లి ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. వారి ముందే భాగయ్య ఎంపీడీవో సంతోష్‌రెడ్డికి ఫోన్ చేసి తన సర్వీస్ రిజిస్టర్ ఇవ్వాలని కోరారు. ఈ మధ్యనే డీజిల్, తదితర బిల్లులు బాగానే వచ్చాయి కదా.. ఈ మాత్రం డబ్బులు ఇస్తే తప్పేముందని సంతోష్‌రెడ్డి బదులిచ్చారు. చేసేదిలేక బాధితుడు సీనియర్ అసిస్టెంట్ హరిబాబుకు రూ.8 వేలు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సంతోష్‌రెడ్డి ఆదేశాలతోనే తాను డబ్బులు తీసుకున్నట్టు హరిబాబు ఏసీబీ అధికారులకు తెలిపాడు. దీంతో భిక్కనూర్‌లో ఎంపీడీవో సంతోష్‌రెడ్డిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని కమ్మర్‌పల్లి ఎంపీడీవో కార్యాలయానికి తీసుకొచ్చి విచారించారు. సంతోష్‌రెడ్డి, హరిబాబులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్టు ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు.

### • వైభవంగా లక్ష్మీనృసింహుడి దక్షిణ దిగ్యాత్ర



జగిత్యాల జిల్లా ధర్మపురిలో లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం దక్షిణ దిగ్యాత్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం ఆలయానికి దక్షిణ దిశలో ఉన్న పోలీస్‌స్టేషన్ ఆవరణలో పూజలు నిర్వహించారు. – ధర్మపురి

## ఆడుతూ కుప్పకూలిన విద్యార్థి

ఇల్లంతకుంట, మార్చి 26 : పాఠశాల ఆవరణలోని మైదానం ఆడుతూ ఓ విద్యార్థి గుండెపోటుతో మరణించాడు. సిరిసిల్ల సమీపంలోని కందికట్కూర్‌కు చెందిన ఏలేటి శ్రీనివాస్, జ్యోతి దంపతులకు కుమారుడు సాయితేజ (12)కు గుండెలో రంధ్రం ఉన్నది. చిన్నప్పుడే గుర్తించినా పేదరికం కారణంగా ఆపరేషన్ చేయించలేదు. మందులు వాడుతున్నారు. స్థానిక ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. మధ్యాహ్నం స్నేహితులతో కలిసి పాఠశాల మైదానంలో ఆడుతుండగా సాయితేజ ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. పక్కనే మెట్లపై కూర్చొని పడిపోయాడు. వెంటనే కరీంనగర్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందాడు.

## నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

- ఎంపీ టికెట్ల తుది జాబితా ఖరారు
- సీఎం అయ్యాక 12వ సారి..

హైదరాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ): ఎంపీ టికెట్ల తుది జాబితా ఖరారు కోసం టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టాక ఢిల్లీ వెళ్లడం బుధవారం నాటి పర్యటనతో కలిపి 12సార్లు కానున్నది. ఇప్పటికే రెండు పర్యాయాలు అభ్యర్థుల జాబితా ప్రకటించిన కాంగ్రెస్, ఇంకా ఎనిమిదిమంది అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉన్నది. ఈ సీట్లకు గట్టిపోటీ ఉండటంతో అభ్యర్థుల ఎంపిక అధిష్ఠానానికి తలనొప్పిగా మారింది. ఖమ్మం, వరంగల్, కరీంనగర్, భువనగిరి, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, హైదరాబాద్ స్థానాలకు అభ్యర్థుల ఎంపిక ఇంకా ఖరారు కాలేదు. ఖమ్మం టికెట్ కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తమ కుటుంబసభ్యులకు టికెట్లు దక్కించుకునేందుకు పోటీపడుతున్నారు. భువనగిరి టికెట్ కోసం సీఎం రేవంత్‌రెడ్డి తన అనుచరుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తుండగా, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన భార్య లక్ష్మి కోసం ప్రయత్నిస్తున్నారు. వీరితోపాటు భువనగిరి నుంచి ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన పైళ్ల శేఖర్‌రెడ్డి పేరు కూడా పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. ఇక మిగిలిన ఆరు స్థానాలకు అభ్యర్థుల ఖరారు దాదాపు ఖరారు అయినట్టేనని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి.

### భూకబ్జా కేసులో కాంగ్రెస్ నాయకుడి అరెస్ట్

కరీంనగర్ రాంనగర్, మార్చి 26 : నకిలీ పత్రాలు సృష్టించి భూమిని ఆక్రమించి యజమానిని బెదిరింపులకు గురిచేసిన చింతకుంట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు పిట్టల రవీందర్ సహా మరో ముగ్గురిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్ మాదాపూర్‌లో నివాసం ఉండే పాంరాజ్ దేవీదాస్‌రావు తండ్రి గోవిందరావుకు చింతకుంటలో కొంత భూమి ఉండగా పహాణీలో మరొకరి పేరు వచ్చింది. ఇందుకు బాధ్యులైన ముగ్గురిపై కేసు నమోదు కాగా మంగళవారం పిట్టల రవీందర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.


